'ఆయిల్‌పామ్' నిర్వహణ భారం

- అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు అన్యాయం
- రెండు నెలలుగా అందని ఉపాధి బిల్లులు
- బిల్లులు చెల్లించాలని రైతుల వేడుకోలు

పర్వతగిరి : ఆయిల్‌పామ్ సాగు అన్నదాతలకు శాపంగా మారింది.. ఆయిల్‌పామ్ పంటతో అధిక లాభాలు వస్తాయని అధికారులు ఆశ చూపారు.. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా రైతులకు ఒక్కో మొక్క రూ.90 చొప్పున చెల్లిస్తారని నమ్మబలికారు.. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు నిర్వహణ బిల్లులు జమ కాలేదు.. మండలంలోని చింతనెక్కొండతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. సుమారు 30మందికి పైగా రైతులు రెండు నెలల క్రితం ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. గుంతల తవ్వకం, మొక్కలు నాటడం, వాటి నిర్వహణ కింద మొక్కకు రూ.90చొప్పున ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుంది. అందులో భాగంగా చింతనెక్కొండ గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహనతో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు పొంది మొక్కలను పెంచుతున్నారు. సంబంధిత అధికారులు టెక్నికల్ అసిస్టెంట్, ఈసీలు విధుల పట్ల నిర్లక్ష్యం వహించి డిమాండ్ పొందుపర్చకపోవడం వల్ల రైతులకు రావాల్సిన జాతీయ ఉపాధి హామీ బిల్లులు రాకపోవడంతో ఒక్కో రైతు సుమారు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు నష్టపోయారు. అదే విధంగా రెండు నెలలుగా నిర్వహణ డబ్బులు రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ మొక్కల ద్వారా లాభం వస్తుందని రైతులకు పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో వరి, మొక్కజొన్న, పత్తి పంటలను వదిలేసి ఆయిల్‌పామ్ సాగుపై మక్కువ చూపారు. మూడేళ్ల పాటు నిర్వహణ డబ్బులు చెల్లిస్తుందని ఆశ చూపడంతో ఒక్కో రైతు 3 నుంచి 5ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అధికారులు స్పందించి వెంటనే ఆయిల్‌పామ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.



ఐదు ఎకరాలలో మొక్కలు నాటా..



ఐదు ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాను. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు కాగా టీఏ భూమిని పరిశీలించి మొక్కలు అందించారు. కానీ డిమాండ్ చేయకపోవడంతో మాకు రావాల్సిన డబ్బులు రావడం లేదు. పలుమార్లు విజ్ఞప్తి చేసిన ఎవరు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం విచారణ చేపట్టిన టెక్నికల్ అసిస్టెంట్, ఈసీలపై చర్య తీసుకోవాలి.

\- గొర్ల వెంకన్న, రైతు

లబ్ధి చేకూరుతుందని సాగు చేశా..



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో లబ్ధి చేకూరుతుందని ఆయిల్‌పామ్ సాగుపై మక్కువ చూపా.. మొక్కకు రూ.90తో పాటు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారని అనడంతో 5ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాను. రెండున్నర లక్షలు తెచ్చి మొక్కలు నాటినప్పటికి అధికారులు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేసిన డబ్బులు రావడం లేదు.

\- గటిక రాంచందర్, చింతనెక్కొండ

క్లుప్తంగా

కమిటీ ఎన్నిక



చిన్నవెంకటేశ్వర్లు

నర్సంపేట రూరల్ : మండలంలోని గురిజాల గ్రామంలో మున్నూరుకాపు సంఘం కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారి చిన్నవెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా గజ్జి రాజు, ప్రధాన కార్యదర్శి నామాల సోమయ్య, ఉపాధ్యక్షుడిగా కొత్త కొమ్మాలు, సహాయ కార్యదర్శిగా గుర్రం లక్ష్మీనారాయణ, కోశాధికారిగా రామ్మోహన్‌లు ఎన్నికయ్యారు.

పంచాయతీకార్యదర్శుల మండల ఫోరం..

రాయపర్తి : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బత్తుల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ అశోక్‌నాయక్, గౌరవ అధ్యక్షుడిగా రేమల్లి శంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా లక్ష్మి, కార్తీక్‌రెడ్డి, కార్యదర్శిగా భూక్యా మహేందర్, ప్రచారకార్యదర్శిగా నాగేశ్వర్‌రావు, విజేందర్, సభ్యులుగా ఒడ్డెపల్లి రాజు, అజిత్‌రెడ్డి, శాంతిరాజ్, రోజా, రాధిక, దేవేందర్, వెంకటేష్, వీరేంద్రనాయక్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

వైద్యులకు సన్మానం



వర్ధన్నపేట : వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి, సర్జన్ సోమశేఖర్ తదితరులకు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. నందిపాక భాస్కర్, తుమ్మల రవీందర్, మల్లెపాక భాస్కర్ ఉన్నారు.

మహిళా ఉపాధ్యాయినికి..



దుగ్గొండి : మండలంలోని మందపల్లి ప్రభుత్వ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయురాలు అప్పాల నిర్మలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొగ్గం మహేందర్, ఉప సర్పంచ్ హేమలత, హెచ్‌ఎం కర్ణకంటి రామ్మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు


సంగెం : విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించి వ్యసనాలకు దూరం ఉండాలని నెహ్రూ యువకేంద్రం వలంటీర్లు గాలి భిక్షపతి, సురేష్ సూచించారు. మంగళవారం మండలంలోని కాట్రపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు లైంగిక వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం, గుట్కా, అంబర్ వంటి వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



గీసుకొండ : మండలంలోని కొమ్మాలలో వీఎస్‌ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 320 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ వీఎం జేయుడు, డాక్టర్ అరుణ్‌కుమార్, ఉదయ్‌సింగ్, రవికృష్ణ, కృష్ణకాంత్, మాధవీరెడ్డి, సర్పంచ్ రజిత, యూత్‌నాయకులు జూలూరి లెనిన్‌గౌడ్, ఉషోదయ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వాంకుడోత్ వీరన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బాధ్యులు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్ల శ్రీభక్త వీరాంజనేయస్వామి ఆలయంలో కృష్ణం వందే జగద్గురు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర -2023 క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సొసైటీ ప్రతినిధులు కెత్తె వీరేందర్, ముక్కెర సతీష్, ఆలయ అర్చకులు రాజుచారి, ఆడెపు రమేష్, శ్రీధర్, మద్దెల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

చెన్నారావుపేట : మండలంలోని ఆయా గ్రామాలలో బీజేపీని బలోపేతం చేయాలని మండల ఇన్‌చార్జ్, నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ అన్నారు.ఈ మేరకు మండలంలోని అమీనాబాద్ గ్రామంలో 209, 210 బూత్‌లలో కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, నల్లబెల్లి సుదర్శన్, అంబాల రామ్‌గోపాల్, పులి ప్రసాద్, రాజేందర్, అనిల్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

పత్తిలోడుతో రైతుల నిరసన



రోడ్డుకు అడ్డంగా నిలిపిన పత్తి లోడు వాహనాలు

వర్ధన్నపేట : వరంగల్ మార్కెట్‌లో పత్తిని అమ్ముకోవడానికి రైతులు వ్యాన్‌లో పత్తిలోడుతో తీసుకువస్తున్నారు. మార్కెట్ సెస్ చెల్లించాలంటూ తమ వాహనాలను ఆపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం వర్ధన్నపేట పాత బస్టాండ్ వద్ద వ్యాన్లను రోడ్డుకు అడ్డంగా నిలిపి నిరసన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా తిరుమాలాయపాలెంకు చెందిన కొందరు రైతులు రెండు బొలేరో వాహనాల్లో పత్తి లోడును తీసుకుని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వెళ్తున్నట్లు తెలిపారు. వర్ధన్నపేట మార్కెట్ చెక్ పోస్ట్ సిబ్బంది తమకు సెస్ చెల్లించాలని లేకపోతే వాహనానికి రూ. వంద చొప్పున ఇచ్చి వెళ్లాలని అనడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేసి మార్కెట్ సిబ్బందితో వాదనకు దిగారు. వెంటనే అసహనం వ్యక్తం చేస్తూ రెండు వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో జాతీయ రహదారి కావడంతో రోడ్డుకు ఇరువైపుల భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి వాహనాలను రోడ్డు నుంచి తొలగించి పంపించి వేశారు. రైతులు మాట్లాడుతూ తాము ఖమ్మం జిల్లా నుంచి వరంగల్‌కు చేరుకునే వరకు నాలుగు మార్కెట్ చెక్ పోస్టులు వస్తాయని రోజు లోడుతో వస్తూ ప్రతి చెక్ పోస్టు వద్ద రూ. వంద చెల్లిస్తే ఎలా కుదురుతుందన్నారు. అదే విధంగా తాము ఏ మిల్లుకు వెళ్తామో తెలియదని, మార్కెట్‌లో సెస్ మినహాయించుకుంటారని ఇందుకోసం తమను ఎందుకు ఇబ్బందుల పాలు చేయాలని ప్రశ్నించారు.

స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న ప్రసాద్

సంగెం : సంగెం, గీసుకొండ మండలాల పరిధిలో నిర్మిస్తున్న టెక్స్‌టైల్ పార్కులో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆరెల్లి ప్రభాకర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి రైతుల నుంచి భూములు తీసుకునే ముందు స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన అధికారులు, ప్రజాప్రతినిధులు మోసం చేశారని విమర్శించారు. ఇతర రాష్ట్రాల వారిని తీసుకోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో జున్న సాంబయ్య, మెట్టుపల్లి స్వామి, భరత్, రాములు, సాయిలు, వెంకటేష్, మణెమ్మ, కొమురమ్మ, ఎలిషా పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



ఫుట్‌బోర్డ్‌పై కిక్కిరిసి వెళ్తున్న విద్యార్థులు

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి గ్రామసెంటర్ నుంచి వివిధ మండలాల పరిధిలోని 30 గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ప్రతిరోజు విద్యానభ్యసించడానికి వరంగల్, నర్సంపేట పట్టణాలలోని పలు కళాశాలలకు వెళ్తుంటారు. అయితే ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు ప్రధాన రహదారిపై విద్యార్థులు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సులు అరకొరగా వస్తుండటంతో కళాశాలకు సమయం దాటుందనే తొందరలో విద్యార్థులు ఫుట్‌బోర్డ్‌పై పదుల సంఖ్యలో నిలబడి వెళ్తున్నారు. నిత్యం ఇదే తంతు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, ఆర్టీసీ అధికారులు సమస్యను పరిష్కరించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కామాటి, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దేవేందర్

పర్వతగిరి : తప్ప తాగి విద్యార్థులపై విచక్షణా రహితంగా దాడి చేసిన కామాటి టి.ఆనందం, అతడికి వత్తాసు పలికిన హాస్టల్ వార్డెన్ రవీందర్‌ను సస్పెండ్ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. ఈనెల 1వ తేదీన సాయంత్రం కామాటి ఆనందం మద్యం తాగి హాస్టల్‌లోకి వచ్చి విద్యార్థులను అసభ్యకరమైన మాటలతో అదిరిస్తూ.. భయభ్రాంతులకు గురి చేస్తూ విద్యార్థులను కర్రతో గాయపర్చాడన్నారు. విద్యార్థులు భయంతో హాస్టల్ వార్డెన్‌కు చెబితే అతను కూడా ఆనందంకు వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. వెంటనే అధికారులు స్పందించి వార్డెన్ రవీందర్, కామాటి ఆనందంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హేమంత్, ఆశ్రయి, కార్యకర్తలు శ్రీకాంత్, శశాంక్, సందీప్, రాకేష్, ప్రశాంత్, శివ, దిలీప్, దీపక్, మహేందర్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ కామాటి సస్పెన్షన్

పర్వతగిరి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆదివారం మధ్యాహ్నం కామాటి టి.ఆనందం తప్పతాగి విద్యార్థులపై దురుసుగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై హాస్టల్ వార్డెన్ రవికుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా కలెక్టర్, డీఎస్‌డీఓ ఆదేశాల మేరకు ఏఎస్‌డబ్ల్యూఓ వెంకటరెడ్డి ఆనంద్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం వార్డెన్ రవికుమార్‌కు ఆర్డర్ కాపీని ఎస్సీ హాస్టల్‌లో అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారులు బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడ పీహెచ్‌సీ కేంద్రంలో పనిచేసిన డాక్టర్ సరోజ, కీర్తినగర్ యూపీహెచ్‌సీలో పనిచేసిన డాక్టర్ సుమన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి సిబ్బంది సహకరించాలని అన్నారు. కరోనా మళ్లీ విజృంభిస్తుండడంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

రైతులకు శిక్షణ శిబిరాలు

నర్సంపేట : మిర్చి తోటలలో వచ్చిన, వస్తున్న చీడపీడల నివారణ, నిర్మూలన కోసం బాంజిపేట, కమ్మపల్లి, దాసరిపల్లి, చంద్రయ్యపల్లి, మాధన్నపేట, చుట్టూ తండాల రైతులకు ఈనెల 5వ తేదీన బాంజిపేట గ్రామ పంచాయతీ వద్ద శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, కార్యదర్శి నాగెల్లి సారంగం, రవీందర్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలకు న్యూఢిల్లీ, బెంగళూరు, తెలంగాణ కొండా లక్ష్మణ్‌బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వచ్చి రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల మిర్చి సాగు చేస్తున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళల్లో ఉత్సాహం నింపేందుకే పోటీలు

ఎమ్మెల్యే అరూరి రమేష్



కుర్చీఆట ఆడుతున్న మహిళలు

పర్వతగిరి : అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని కల్లెడ గ్రామంలో మంగళవారం సంక్రాంతి సంబరాలలో భాగంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించగా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ మహిళల్లో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపేందుకు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ప్రతీ గ్రామంలో సంక్రాంతి సంబరాల పేరుతో మహిళలకు ముగ్గులు, ఆటలు, పాటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. సంక్రాంతి సంబరాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమలలో ఎంపీపీ లూనావత్ కమలపంతులు, జెడ్పీటీసీ సింగ్‌లాల్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నర్సంపేట: పనులు ప్రారంభిస్తున్న గుంటి రజని



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ జయగోపాల్‌రెడ్డి

నర్సంపేట : మున్సిపల్ సాధారణ నిధుల నుంచి మంజూరు అయిన డ్రెయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 7వ వార్డు, 12వ వార్డు, 17వ వార్డులో డ్రెయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఆకులతండా గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ కోమండ్ల జయగోపాల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, సర్పంచ్ బానోత్ రాము, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ఫుడ్ ప్రాసెసింగ్'కు ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సరిత

సంగెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఉజ్వల భవిష్యత్ ఉందని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సరిత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శాంత మండల సమాఖ్య కేంద్రంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల వ్యవస్థీకరణ పథకంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూక్ష్మ ఆహార శుద్ధి రంగాన్ని సంస్థాగతంగా బలోపేతం చేయడం, పరిశ్రమల సామర్థ్యం పెంచేందుకు తోడ్పాటునందిస్తామన్నారు. ఆహార ఉత్పత్తుల మార్కెటింగ్‌కు రాష్ట్రస్థాయిలో వివిధ సంస్థలతో సెర్ప్ ఎంఓయూ చేసుకుంటుందన్నారు. ఇందుకోసం రుణ సదుపాయం కల్పించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు గీత, కిషన్, ఫుడ్ సొసైటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ రమణ, జిల్లా రిసోర్స్ పర్సన్ సాగర్, సీసీలు సురేశ్, రాజయ్య, స్వరూపరాణితో పాటు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

చెన్నారావుపేట : మండలంలోని బోడమాణిక్యం తండాకు చెందిన బోడ వస్రాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా వస్రాం బీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకొని ఉండటంతో అతని పేరుమీద ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 2 లక్షల చెక్కును మృతుడి భార్య బద్రికి సర్పంచ్ బోడ ఆనంద్ మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోడ శ్రీనివాస్, బోడ రాజన్న, భూక్యా రవి, లక్ష్మణ్, గణేష్, సువాలి తదితరులు ఉన్నారు.



దుగ్గొండి: మల్లంపల్లి కస్తూర్బా విద్యాలయంలో..



నర్సంపేట: నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రజని



నర్సంపేట: పూలమాల వేస్తున్న వంగల రాగసుధ

సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

సంఘ సంస్కర్త, సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని పలువురు ఆమె సేవలను కొనియాడారు. సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లాలోని ఆయా మండలాల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



నెక్కొండ: సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వర్ధన్నపేట: మున్సిపల్ కార్యాలయంలో అరుణ



వర్ధన్నపేట: ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో..



నర్సంపేట: నివాళులర్పిస్తున్న విద్యా నాయకులు



ఖానాపురంలో..



నర్సంపేట: పూలమాల వేస్తున్న పంజాల రమేష్



సంగెంలో..

గుడుంబా విక్రయిస్తే కఠినచర్యలు



ఖానాపురం : గుడుంబా తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరీ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గుడుంబా స్థావరంపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూప అనే మహిళ వద్ద నుంచి 8 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. రాజేశ్వరీ మాట్లాడుతూ.. నిషేధిత గుడుంబాను తయారీ, విక్రయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. సిబ్బంది పాల్గొన్నారు.